క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 7న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. అమ్మవారిపేట, భట్టుపల్లి, కొత్తపల్లి, సూర్య కుటీర్, ఆర్‌జీకే, బోడగుట్ట, కడిపికొండ, అయోధ్యపురం ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మడికొండ ఇండస్ట్రియల్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, విద్యానగర్, ప్రెసిడెన్సీ స్కూల్ ప్రాంతాల్లో ఉదయం 10.30 నుంచి 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

తల్లిపాలపై అవగాహన

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే ఆస్పత్రిలో బ్రెస్ట్ ఫీడింగ్ అవేర్‌నెస్ క్యాంపును బుధవారం నిర్వహించారు. రైల్వే ఆస్పత్రి ఏసీఎంఎస్ డాక్టర్ ఐ.నిరంజన్‌రావు, లక్ష్మీనరసింహ ఆస్పత్రి వైద్యురాలు సంధ్యారాణి పాల్గొని తల్లిపాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైల్వే ఆస్పత్రి డాక్టర్లు హరిబాబు, వినయ్‌బాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పుష్పాలంకరణలో మల్లన్న

కాజీపేట: శ్రావణ మాసోత్సవాలను పురస్కరించుకుని కాజీపేట భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయంలో దేవతామూర్తులను పూలతో బుధవారం ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు అయినవోలు ప్రవీణ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో అర్చకులు మహా రుద్రాభిషేకంతో పాటు పూలతో అలంకరణ చేశారు. కార్యక్రమంలో గంపా సాంబమూర్తి, చంద్రమోహన్, నగేష్, శివశక్తి యూత్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

'పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్' సందర్శన

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాన్ని రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విభాగం పనితీరును ఆ విభాగం అధిపతి డాక్టర్ ఆకుతోట శ్రీనివాస్ వివరించారు. కార్యక్రమంలో విభాగం బీఓఎస్ చైర్మన్ డాక్టర్ చీకటి శ్రీను, అధ్యాపకులు డాక్టర్ ఉమాశంకర్, డాక్టర్ మోహన్, డాక్టర్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి




మడికొండ: రైతులు అప్రమత్తంగా ఉండాలని మడికొండ గ్రామ పోలీసు అధికారి హెడ్ కానిస్టేబుల్ జయరాజ్ సూచించారు. మడికొండ పాత పోలీసుస్టేషన్ బురుజు వద్ద రైతులతో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో వ్యవసాయ బావుల వద్ద ట్రాన్స్‌ఫార్మర్లు, కాపర్ వైర్లు చోరీకి గురవుతున్నాయని అన్నారు. ఈ క్రమంలో అనుమానితులపై రైతులు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కరుణాకర్ రెడ్డి, నిరంజన్, సురేష్, రాజయ్య, కృష్ణమూర్తి, మొగిలయ్య, తదితరులు పాల్గొన్నారు.

'గోల్డెన్ ఓక్'లో ఇన్వెస్టిచర్



రామన్నపేట: వరంగల్ నగరంలోని కాపువాడ గోల్డెన్ ఓక్ స్కూల్‌లో ఇన్వెస్టిచర్ వేడుకను బుధవారం నిర్వహించారు. నూతనంగా ఎన్నికైన స్టూడెంట్ కౌన్సిల్ సభ్యులకు అధికార బాధ్యతలు అప్పగించారు. ఈ వేడుకల్లో చైర్మన్ గంటా రవికుమార్, శివనగర్, కాపువాడ బ్రాంచ్ ప్రిన్సిపాళ్లు మనోహర్‌రావు, దీప్తి బుసాని హాజరై విద్యార్థులను ఉత్తేజపరిచారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ నాయకత్వం అనేది హోదా కాదని, బాధ్యత అని గుర్తు చేశారు. ఈ సందర్భంగా హెడ్ బాయ్, హెడ్ గర్ల్, స్పోర్ట్స్ హెడ్, కల్చరల్ హెడ్ కెప్టెన్లు, వైస్ కెప్టెన్లకు బ్యాడ్జీలు, సాషెస్లు ప్రదానం చేశారు.

సైబర్ నేరాలపై జాగ్రత్త



విద్యారణ్యపురి: సైబర్ నేరాలు రోజురోజుకు పెరిగిపోతున్న నేపథ్యంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని హనుమకొండ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సతీష్ సూచించారు. హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజీలు, లింక్‌కు స్పందించవద్దని సూచించారు. ఒకవేళ సైబర్ మోసానికి గురైనట్లు గ్రహిస్తే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేసి సమాచారం అందించాలని ఇన్‌స్పెక్టర్ సతీష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు రాజ్‌కుమార్, దయాకర్, ఏఎస్సై రఘువీర్, స్టూడెంట్ కౌన్సిలర్ రాజేశ్వర్‌కుమార్, సరిత, తదితరులు పాల్గొన్నారు.

బస్తీ మే సవాల్!

- రోడ్డెక్కిన ఆర్యవైశ్య పట్టణ సంఘం పంచాయితీ
- ప్రక్షాళన కోసం ఓ వర్గం.. అభివృద్ధి చేశామని మరో వర్గం
- ప్రకాశ్‌రావు వర్సెస్ మహేష్‌బాబు వర్గంగా మారిన సభ్యులు

రామన్నపేట: గతంలో ఎన్నడూలేని విధంగా వరంగల్‌లోని ఆర్యవైశ్య పట్టణ సంఘం సభ్యులు రెండు వర్గాలుగా విడిపోయి రోడ్డెక్కారు. బస్తీ మే సవాల్ అన్న విధంగా సవాళ్లు, ప్రతిసవాళ్లు విసురుకుంటున్నారు. ఈ సంఘానికి ప్రతినెలా లక్షలాది రూపాయల అద్దెలు రావడం.. వేలాది రూపాయలతో కార్పొరేషన్లు కొనసాగడం.. పేద ఆర్యవైశ్యుల ఉన్నతి కోసం చేపట్టిన హౌసింగ్ సొసైటీలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయనే ఆరోపణలతో గట్టు మహేష్‌బాబుకు చెందిన ప్రతినిధులు.. బాధితుల పక్షాన పోరాడుతున్నామని పట్టణ సంఘాన్ని వేదిక చేసుకున్నారు. కాగా, పట్టణ సంఘం నిధుల వినియోగంలో ఎలాంటి అవకతవకలు జరగలేదని, వైశ్య సత్రం పేరుతో లక్షల రూపాయలు వసూలు చేసింది ఆ వర్గం వారేనని గుండా ప్రకాశ్‌రావు వర్గీయులు ఆరోపణలు చేస్తూ ప్రతిదాడికి దిగారు.

ముదిరిన పంచాయితీ

ఇరువర్గాల పంచాయితీ కాస్త బుధవారం నాటికి మరింతగా ముదిరింది. గట్టు మహేష్‌బాబుపై గుండా ప్రకాశ్‌రావు మంగళవారం తీవ్ర ఆరోపణలు చేసిన నేపథ్యంలో మహేష్‌బాబు బుధవారం మధ్యాహ్నం పట్టణ సంఘానికి చేరుకోవడం ఇంకాస్త వివాదం ముదిరింది. పట్టణ సంఘానికి తాళం వేసి ఉండడంతో గట్టు మహేష్‌బాబు వర్గం ఆ తాళాన్ని తీసి సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించింది. గత కొద్దిరోజులుగా పట్టణ సంఘంలో జరుగుతున్న విషయాలను పాత్రికేయులకు మహేష్ బాబు వెల్లడించారు. కాగా, కోట్లాది రూపాయల విలువ గల పట్టణ సంఘం నిర్వహణ ఎవరి చేతిలో ఉంది.. సంఘం తాళాల ఎవరి వద్ద ఉన్నాయి.. అసలు ఏం జరుగుతుందో తెలియని అయోమయ పరిస్థితి పట్టణ సంఘం కార్యాలయంలో నెలకొంది.

కోట్లాది రూపాయల నిధుల లెక్క చూపించు



14 సంవత్సరాల నుంచి సంఘం లావాదేవీలు సభ్యులకు వెల్లడించకుండా సంఘం భవన కిరాయిదారుల నుంచి వసూలు చేసిన రూ.45 లక్షలు, ప్రతినెలా అద్దె రూ.4.50 లక్షలు, 11 కార్పొరేషన్ నిధులను బ్యాంకు ద్వారా లావాదేవీలు జరపకుండా ఇన్ని సంవత్సరాలు మభ్యపెట్టడానికి కారణమేమిటి. గుండా ప్రకాశ్‌రావు చేసిన ఆరోపణలపై చర్చించేందుకు సంఘానికి వచ్చా. బాధితులకు న్యాయం చేసేందుకు ప్రకాశ్‌రావు సంఘానికి రావాలి. రూ.1.10 కోట్లను గుండా ప్రకాశ్‌రావు తన స్వంత సంస్థ అయిన భవితశ్రీ చిట్‌ఫండ్‌కు ఎలా బదిలీ చేశారో చెప్పాలి.

\- గట్టు మహేష్‌బాబు

ఆర్యవైశ్యుల ఆర్థిక ఎదుగుదలకు కృషి చేశా



ఆర్యవైశ్య పట్టణ సంఘం అధ్యక్షుడిగా పేద ఆర్యవైశ్యుల ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేశా. నేను నగరంలో లేనప్పుడు దౌర్జన్యం చేయడం సమంజసం కాదు. రాజకీయాలను సంఘంలో పెట్టి మహేష్‌బాబు విబేధాలు సృష్టిస్తున్నాడు. వైశ్య ఎడ్యుకేషన్ ట్రస్టు డబ్బులను సత్రం పేరుతో లక్షలాది రూపాయలు మహేష్‌బాబు వసూలు చేశాడు. నాపై ఆరోపణలు చేసిన ప్రతి అంశంపై మహేష్‌బాబుపై పరువుదావా నష్టం వేస్తా.

\- గుండా ప్రకాశ్‌రావు

వైభవంగా పోచమ్మ తల్లి బోనాలు



ఆలయానికి బయల్దేరిన అల్లీపురం మహిళలు



మెట్టుగుట్టపై పూజలు చేస్తున్న భక్తులు

మామునూరు: శ్రావణమాసం సందర్భంగా ఖిలా వరంగల్ మండలం తిమ్మాపురం అల్లీపురం గ్రామంలో పోచమ్మతల్లి బోనాల పండుగను బుధవారం వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు బోనాలతో ఆలయానికి చేరుకొని పోచమ్మ తల్లికి నైవేద్యం సమర్పించారు. గుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి కల్లు ఆరబోసి మేకలు, కోళ్ల బలిచ్చారు.

పోచమ్మ తల్లికి మొదటి బోనం

మడికొండ: 46వ డివిజన్ మెట్టుగుట్ట వద్ద ఉన్న పోచమ్మ తల్లి ఆలయంలో అమ్మవారికి పంచామృతాలతో బుధవారం ఉదయం అభిషేకం నిర్వహించారు. అనంతరం కార్యనిర్వహణాధికారి కే.శేషభారతి మొదటి బోనం సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు సమర్పించారు. కార్యక్రమంలో శివాలయం, రామాలయ చైర్మన్లు పైడిపాల రఘుచందర్, పల్లవు అర్జున్, రామాలయం, శివాలయ కార్యనిర్వహణాధికారులు సత్యనారాయణ, ఆర్.సునీత, అర్చకులు రాగిచేడు అభిలాష్ శర్మ, పరాశరం విష్ణువర్ధనచార్యులు, పారుపల్లి సత్యనారాయణ శర్మ, ధర్మకర్తలు బైరి రాజుగౌడ్, రొడ్డ దయాకర్, దండిగం శ్రీనివాస్, వస్కుల ఉమ, జ్ఞానేశ్వరి, భక్తులు పాల్గొన్నారు.

కష్టపడితే లక్ష్య సాధన సులభం



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

హసన్‌పర్తి: కష్టపడి చదివితే లక్ష్య సాధన సులభమవుతుందని ఇన్‌స్పైర్ కళాశాల చైర్మన్ తీగల భరత్‌కుమార్ గౌడ్ అన్నారు. ఎర్రగట్టు గుట్ట సమీపంలోని కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థుల స్వాగతోత్సవ కార్యక్రమాన్ని బాలాజీ గార్డెన్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యపై దృష్టి సారించి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగితే గమ్యాన్ని చేరుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరాంరెడ్డి, కళాశాల డైరెక్టర్ రాజ్‌కుమార్, మమత, శివ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మధ్యకోటలో హర్ ఘర్ తిరంగా

ఖిలా వరంగల్: మధ్యకోట శిల్పాల ప్రాంగణంలో కేంద్ర పురావస్తుశాఖ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు బుధవారం నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని నాలుగు కీర్తితోరణాల మధ్య రంగుల ముగ్గుతో జాతీయ జెండా వేసి హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం హర్ ఘర్ తిరంగా విశిష్టతను వివరించారు.

స్థానిక సమస్యలపై సీపీఎం సర్వే



సమస్యలపై సర్వే చేస్తున్న నాయకులు

ఖిలా వరంగల్: వరంగల్ 32వ డివిజన్ కరీమాబాద్ బీరన్న కుంటలో సీపీఎం ఏరియా కార్యదర్శి సింగారపు బాబు ఆధ్వర్యంలో స్థానిక సమస్యలపై బుధవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. గాంధీ విగ్రహం కోయవాడ నుంచి ఖమ్మం రోడ్డులోని కళింగ దాబా వరకు డ్రెయినేజీ సమస్య తీవ్రంగా ఉందని గుర్తించారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ కళింగ బార్ నుంచి బైపాస్ రోడ్డు వరకు 34 ఫీట్ల సీసీ రోడ్డు నిర్మించాలని, నిలిచిన బీరన్నకుంట కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను పూర్తిచేయాలని, బీరన్న కుంట ట్రాన్స్‌ఫార్మర్ స్థలంలో గ్రంథాలయాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు. బీరన్నకుంట ఎస్సీ కుటుంబాలకు శ్మశాన వాటిక స్థలాన్ని ప్రభుత్వమే కేటాయించాలని, దోమల నిర్మూలనకు ఫాకింగ్ చేపట్టాలని కోరారు. ఏరియా కార్యదర్శి గున్నాల ప్రభాకర్, అప్పాజీ వాణి, మాదాసి దివ్య, ఉపేందర్, యాకూబ్‌పాషా, కాల నీవాసులు ప్రశాంత్, శ్రావణ్ పాల్గొన్నారు.

సభ్యుల మానసికోల్లాసానికి పోటీలు



క్యారమ్స్ పోటీలను ప్రారంభిస్తున్న రాఘవేందర్

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే జనరల్ ఇన్‌స్టిట్యూట్‌లో సభ్యుల మానసికోల్లాసం కోసం సికింద్రాబాద్ రైల్వే అధికారుల సహకారంతో ఇన్‌స్టిట్యూట్ కమిటీ కృషి చేస్తోందని ఇన్‌స్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్ అన్నారు. కాజీపేట రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో క్యారమ్స్ సింగిల్స్, డబుల్స్‌ను ట్రెజరర్ జి.రాజేశ్వర్‌రావుతో కలిసి బుధవారం రాత్రి రాఘవేందర్ ప్రారంభించి మాట్లాడారు. ప్రతి సంవత్సరం లాగే ఈసారి కూడా స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సభ్యులకు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. గురువారం నుంచి టేబుల్ టెన్నిస్, బిలియర్డ్స్, షటిల్ సింగిల్స్, డబుల్స్, చెస్, రైల్వే కార్మిక పిల్లలకు కల్చరల్ డ్రాయింగ్, పెయింటింగ్స్, వ్యాసరచన, మహిళా కార్మికులకు ముగ్గుల పోటీలు, స్టార్ మహిళా క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలకు ఆగస్టు 15న బహుమతులు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌స్టిట్యూట్ కమిటీ సభ్యులు సుంచు ప్రశాంత్, పి.ప్రశాంత్, ఎండి.చాంద్‌పాషా, జె.దేవదాసు, రాజేంద్రప్రసాద్, ఎ.రఘుపతి, జి.భాస్కర్, సాంబయ్య పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

భద్రకాళి దేవాలయంలో వన మహోత్సవం

హన్మకొండ కల్చరల్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు భద్రకాళి దేవాలయ ప్రాంగణంలో 50 రకాల పూలు, పండ్ల మొక్కలను బుధవారం నాటారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ, జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత, దేవాలయ అర్చకుడు భద్రకాళి శేషు, ధర్మకర్త మండలి చైర్మన్ డాక్టర్ బండారు శివ సుబ్రహ్మణ్యం, ధర్మకర్తలు వీరన్న, పూర్ణచందర్, సతీష్, ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, దేవాలయ పరిశీలకుడు అద్దంకి విజయ్‌కుమార్, సిబ్బంది కృష్ణ, శ్యాంసుందర్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

రైలుకింద పడి యువకుడి ఆత్మహత్య

ఖిలా వరంగల్: జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు గుర్తు తెలియని రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వరంగల్ – కాజీపేట రైల్వేస్టేషన్ మధ్య దర్గా రైల్వేగేట్ సమీపంలో చోటు చేసుకుంది. జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ ఎస్.రవీందర్ రెడ్డి కథనం ప్రకారం దర్గా కాజీపేట గాంధీనగర్‌కు చెందిన బర్ల మధు(27) భవన సెంట్రింగ్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. వ్యక్తిగత కారణాలతో జీవితంపై విరక్తి చెంది బుధవారం తెల్లవారుజామున రైలుకింద పడి బలవన్మరణం చెందాడు. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించి పోస్టుమార్టం అనంతరం మృతుడి తండ్రి కుమారస్వామికి అప్పగించినట్లు వరంగల్ జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ వివరించారు.

గంజాయితో పట్టుబడిన వ్యక్తి

కాజీపేట: కాజీపేట బంధం చెరువు సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ యువకుడిని అదుపులోకి తీసుకుని అతడి వద్ద నుంచి కిలోకుపైగా గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ సుధాకర్ రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం బంధం చెరువు ప్రాంతంలో ఎస్సై లవన్‌కుమార్ తన సిబ్బందితో కలిసి బుధవారం పెట్రోలింగ్ చేస్తుండగా వారిని చూసి పారిపోవడానికి ప్రయత్నించిన బీహార్ రాష్ట్రానికి చెందిన సంజయ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. సుమారు రూ.53 వేల విలువైన గంజాయిని స్వాధీనం చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

మతిస్థిమితం లేక ఇంటికి నిప్పు

కాజీపేట: మతిస్థిమితం సరిగాలేని ఓ యువకుడు కాజీపేట మండలం బంధం చెరువు క్రాస్ రోడ్డులోని తన ఇంటిపై బుధవారం రాత్రి పెట్రోల్ పోసి నిప్పు అంటించడంతో రూ.లక్షకుపైగా విలువైన ఫర్నిచర్ అగ్నికి దగ్ధమైంది. ఫైర్ సిబ్బంది యాకుబ్, శివసత్యసాయి అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం కందారపు వెంకటేశ్వర్లు అనే ప్రైవేట్ రిటైర్డ్ ఉద్యోగి భార్య ఇటీవల కన్నుమూసింది. వారి పెద్ద కుమారుడు యశ్వంత్ కొద్దిరోజులుగా మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో తన కొడుకుతో ప్రాణభయం ఉందని వెంటనే ఎర్రగడ్డ ఆస్పత్రిలో చేర్పించడానికి సహకరించాలంటూ పోలీసులను వెంకటేశ్వర్లు వేడుకుంటున్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



నూతన కమిటీ సభ్యులను వరుణ్‌రెడ్డికి పరిచయం చేస్తున్న ఆరెపల్లి మోహన్

హన్మకొండ: విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ప్రభుత్వ విప్ ఆరెపల్లి మోహన్ కోరారు. హనుమకొండలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే, అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు తాటికొండ రాజయ్య, అసోసియేషన్ నాయకులతో కలిసి ఆరెపల్లి మోహన్ బుధవారం కలిశారు. నూతనంగా ఎన్నికైన అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బక్క దానయ్య, ఎన్పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడు పి.రామస్వామి, కార్యదర్శి ఆరెపల్లి శ్రీనివాస్‌తో పాటు కమిటీ సభ్యులను సీఎండీ వరుణ్ రెడ్డికి పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల పదోన్నతి, పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఎన్పీడీసీఎల్ కంపెనీ ఉపాధ్యక్షుడు రౌతు రమేష్ కుమార్, నాయకులు సుధాకర్, లక్ష్మీనారాయణ, రేణుకా దేవి, చలపతి, గోపీనాథ్, కృష్ణ, థామస్, మోహన్, ప్రశాంత్, ఎస్.కుమారస్వామి, వి.కృష్ణ, రాజయ్య, వినోద్ కుమార్, కుమారస్వామి, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు

న్యూశాయంపేట: దేశ స్వాతంత్ర్య పోరాటంలో వేలాదిమంది బలిదానం చేసిన వీరోచిత పోరాటాల చరిత్ర సీపీఐ సొంతమని, పార్టీ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జరుగుతున్న రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు పిలుపునిచ్చారు. హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో మహాసభల వాల్‌పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 20, 21, 22వ తేదీల్లో మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ మండలం గాజుల రామారంలో జరగనున్న మహా సభల్లో పార్టీ విస్తరణ, ప్రజా సమస్యలపై పోరాటాలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నట్లు తెలిపారు. కె.భిక్షపతి, కరుణాకర్, శ్రీనివాస్, సదాలక్ష్మి, టి.భిక్షపతి, ఎల్లేష్, కర్రె లక్ష్మణ్, ఎం.భిక్షపతి, సంతోష్, రాజు, సారంగపాణి, రవి, సదానందం, ఓదెలు, రమాదేవి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

కాజీపేట: సీపీఐ రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ కాజీపేట మండల కేంద్రంలో వాల్‌పోస్టర్లను కార్యకర్తలు బుధవారం ఆవిష్కరించారు. జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల కార్యదర్శి మాలోతు శంకర్ నాయక్, సహాయ కార్యదర్శి వేల్పుల సారంగపాణి యాదవ్, మునిగాల భిక్షపతి, రాసమల్ల దీన, పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిజంలో ఉపాధి అవకాశాలు

- కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ రామచంద్రం

కేయూ క్యాంపస్: జర్నలిజం కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు మీడియా రంగంలో విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తాయని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం తెలిపారు. కాకతీయ యూనివర్సిటీలోని దూరవిద్యా కేంద్రం సెమినార్ హాల్‌లో బీబీసీ కలెక్టివ్ న్యూస్ రూమ్ అండ్ బీబీసీ తెలుగు చానల్ ఆధ్వర్యంలో జర్నలిజం విద్యార్థులకు ఔట్‌రిచ్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీబీసీ న్యూస్ చానల్‌కు విశ్వసనీయత ఉందన్నారు. ఈ సందర్భంగా ట్రైనింగ్ అండ్ కల్చర్, బీబీసీ న్యూస్ ఇండియా విభాగం అధిపతి ఇక్బాల్ అహ్మద్ కీలకోపన్యాసం చేశారు. సమావేశంలో దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ సురేష్‌లాల్, జర్నలిజం విభాగం అధిపతి డాక్టర్ సంగని మల్లేశ్వర్, కేయూ ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బిక్షాలు, బీబీసీ చానల్ అసిస్టెంట్ ఎడిటర్ అనిల్, అధ్యాపకులు నర్సింహారాములు, శ్రీకాంత్, వంగాల సుధాకర్, పెరుమాళ్ల వెంకటేశ్వర్లు, సురేందర్ పాల్గొన్నారు.

ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళి



హనుమకొండ కలెక్టరేట్‌లో జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అధికారులు

తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతిని నగరవ్యాప్తంగా బుధవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

\- సాక్షి నెట్‌వర్క్



కాజీపేట తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ భావ్‌సింగ్, ఉద్యోగులు



శివనగర్‌లో నివాళులర్పిస్తున్న సామాజిక వేత్తలు మేరుగు అశోక్, గద్దం రవి



కాజీపేట చౌరస్తాలో జయశంకర్ జయంతిలో బీఆర్ఎస్ నాయకులు



భీమారంలో జయశంకర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, నన్నపునేని నరేందర్, నాయకులు

జర్నలిస్టులకు ఫొటోగ్రఫీ పోటీలు



సమావేశంలో మాట్లాడుతున్న వేముల నాగరాజు

నయీంనగర్: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో స్టాఫ్ ఫొటో జర్నలిస్టులకు ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకు బెస్ట్ న్యూస్ పిక్చర్, ఫీచర్, కల్చర్ విభాగాల్లో 8/12 సైజుల్లో ఫొటోలు పంపించాలని కోరారు. ఒక్కొక్కరు 3 ఫొటోలు పంపవచ్చని, ఉత్తమ ఫొటోలకు ప్రథమ బహుమతి కింద రూ.10 వేలు, ద్వితీయ బహుమతి రూ.5 వేలు, తృతీయ బహుమతి రూ.3 వేలు, కన్సోలేషన్ బహుమతి కింద రూ. వేయితో పాటు షీల్డ్, సర్టిఫికెట్ అందజేయనున్నట్లు వివరించారు. వివరాలకు 90002 83008 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి అమర్, సహాయ కార్యదర్శులు పెద్దపల్లి వరప్రసాద్, నయీంపాషా పాల్గొన్నారు.